8 నుంచి 23 వరకు జిల్లాలో సిటీ పోలీసు యాక్టు అమలు

సిపి సాధన రష్మీ పెరుమాళ్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: జిల్లా పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈనెల 8 నుంచి 23 వరకు సిటీ పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని సీపీ సాధన రష్మీపెరుమాళ్ బుధవారం తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. ధర్నాలు, రాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ముందస్తుగా పోలీసు అధికారుల అనుమతి తీసుకోవాలని చెప్పారు. బందిల పేరిట వివిధ కారణాలను చూపుతూ బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసివేయాలని ఒత్తిడి బెదిరింపులకు గురిచేసేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలన్నారు. అలాగే కమిషనరేట్ పరిధిలో డిజె సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. నిబంధలను ఉల్లంఘించి డిజె వినియోగించేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

రాష్ట్ర పద్మశాలి కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా శ్రీనివాస్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం వివిధ ఫెడరేషన్లకు చైర్మన్లను నియమిస్తూ బుధవారం జారీచేసిన జీవోలో ఎట్టకేలకు సిద్దిపేటకు స్థానం దక్కింది. సిద్దిపేట పట్టణానికి చెందిన మాజీ ఎంపిసి చైర్మన్, టిపిసిసి చేనేత విభాగం అధ్యక్షులు గూడూరి శ్రీనివాస్(ఎస్టీడి)ని రాష్ట్ర పద్మశాలి కో-అపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గూడూరి శ్రీనివాస్ ఎన్ఎస్‌యుఐతో పాటు కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాలలో పనిచేశారు.

2011 నుంచి 2014 వరకు సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం టిపిసిసి చేనేత విభాగం అధ్యక్షులుగా కొనసాగుతున్న గూడూరి శ్రీనివాస్(ఎస్టీడి)ని రాష్ట్ర ప్రభుత్వం పద్మశాలి కో-అపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించింది. సిద్దిపేట ప్రాంతానికి చెందిన గూడూరి శ్రీనివాస్‌కు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కడంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన బొమ్మ శ్రీరాం మున్నూరుకాపు కో-అపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

బస్వాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి ప్రభాకర్

రైతులకు ఇబ్బందులు రానివ్వద్దు

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

కోహెడ, మే 6, ప్రభాతవార్త : కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతిని ఫోన్ లో మాట్లాడి ఆదేశించారు. మండల పరిధిలోని బస్వాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ధాన్యం కొనుగోలులో బారదన్, టార్పాలిన్ సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. లారీలో ఎప్పటిక ప్పుడు ధాన్యం లోడ్‌చేసి పంపించాలన్నారు. కొనుగోలులో నిర్లక్ష్యం చేయొద్దన్నారు.

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

కొమురవెల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

చేర్యాల/కొమురవెల్లి, మే 6, ప్రభాతవార్త : రైతులు పండించిన పంటను పూర్తిగా కొనుగోలు చేస్తామని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లు మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి సూచించారు. బుధవారం చేర్యాట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ, వేచరేణి, కొమురవెల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల కొనుగోలు ప్రక్రియను ఆమె క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గన్నీ బ్యాగులు, హమాలీ, కంతాలుఎ, లారీల కొరత లేకుండా కొనుగోలు సజావుగా జరపాలని కలెక్టర్ అదేశించారు. వేచరేణి గ్రామంలో ఎక్కువ మొత్తంలో ధాన్యం ఉందని లారీల కొరత ఉందని రైతులు తెలపగా లారీలలో కాకుండా అందుబాటులో ఉన్న ట్రాక్టర్, ఇతర వాహనాలలో నింపి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సెంటర్ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. తేమ శాతం వచ్చి తాలు తీస్తేనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. కేంద్రాలలో అన్ని సౌకర్యాలు ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులు పండించిన పంటను పూర్తిగా కొనుగోలు చేస్తామని తెలిపారు. కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం పని చేస్తుందన్నారు.

నేడు ఎస్సీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలు

కొండపాక, మే 6, ప్రభాతవార్త : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలకు గతంలో దరఖాస్తులు చేసుకున్నవారికి ఈ నెల 7వ తేదీన ఎంపిడిఒ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అదేశాల మేరకు ఉదయం 10.30 గంటల నుండి ఇంటర్వూలు నిర్వహించబడతాయని ఎంపిడిఒ వెంకటేశ్వర్లు తెలిపారు. 2025, 2026 సంవత్సరానికి ఈ ఇంటర్వూ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

బిఆర్ఎస్ సమర భేరి సంగ్రామ సదస్సుకు తరలివెళ్లిన శ్రేణులు

బిఆర్ఎస్ సమర భేరి సంగ్రామ సదస్సులకు తరలివెళ్తున్న పార్టీ శ్రేణులు

కొమురవెల్లి, మే 6, ప్రభాతవార్త : డిక్లరేషన్ల పేరుతో అన్నదాతలను వంచించిన కాంగ్రెస్‌పార్టీ గడిచిన రెండున్నర ఏళ్ల గడుస్తున్నా ఒక హామీ కూడా నెరవేర్చని రేవంత్ సర్కార్ రైతాంగాన్ని మోసం చేసినందుకు గానూ రైతుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని బిఆర్ఎస్ పార్టీ సమర భేరి రైతు సంగ్రామ కార్యక్రమానికి బిఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు గీస బిక్షపతి, సిలివేరు సిద్దులు, పడిగన్నగారి మల్లేశం, సార్ల కిష్టయ్య, గొల్లపల్లి కిష్టయ్య, ఏర్పుల మహేష్, స్వాములపల్లి కనకచారీ, గొల్లపల్లి నాగరాజు, సార్ల సురేష్, బండి రమేష్, కడెం కరుణాకర్, ముక్కు బాబు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా విద్యార్థినులు

సిద్దిపేట అర్బన్, మే 6. ప్రభాతవార్త : జిల్లా గోల్ షట్ బాల్ అసోసియేషన్ తరుపున జాతీయస్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు ఎంపిక య్యారు. ఈనెల 9, 10, 11 తేదీలో ఆదిలాబాద్‌లో జరిగే పోటీలలో జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, జిల్లా పరిషత్ ఇందిరానగర్‌కు చెందిన అక్షయ, అర్చన, కృపరాణిలో పాల్గొంటున్నారు. జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటున్న విద్యార్థులను అసోసియేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు జంగిడి శ్రీనివాస్, దామర మల్లేశం, తుమ్మల కనకయ్య, మహేష్, శేఖర్, ప్రేమ్‌కుమార్, సుజాత, తల్లిదండ్రులు అభినందించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాహుల్ గాంధీపై వ్యాఖ్యలు సరికాదు

కెటిఆర్ క్షమాపణ చెప్పాలి
మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ రూరల్, మే 6, ప్రభాతవార్త : కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీపై కేటీఆర్ ఇష్టం వచ్చిన విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని, వెంటనే బేషరత్‌గా క్షమాపణ చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. దాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై సీఎం, చీఫ్ సెక్రటరీ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. దేశంలోనే రూ.21,000 కోట్లతో రైతు రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణదేనని అన్నారు. బిఆర్ఎస్ పార్టీపై విమర్శలుచేస్తూ, అన్ని ఎన్నికల్లో ఓడిపోతూ నిరాశలోఉన్నవారు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సహేతుకం కాదన్నారు. అగ్ర నాయకుడిని అవమానించే విధంగా మాట్లాడడం దుర్మార్గమని తీవ్రంగా ఖండించారు. రైతుల సమస్యలపై సమావేశాలు నిర్వహించే హక్కు బిఆర్ఎస్ నాయకులకు ఉన్నప్పటికీ, గత పదేళ్లలో రైతులను ఖైదీలుగా మార్చి, కాల్పులు జరిపిన సంఘటనలు, మల్లన్నసాగర్ నిర్వాసితులపై లాఠీచార్జ్, గౌరవెల్లి ప్రాజెక్ట్ నిర్వాసిత మహిళలపై అర్ధరాత్రి దాడులు జరిగిన విషయాలను గుర్తు చేశారు. అలాంటి వారు ఇప్పుడు రైతుల గురించి మాట్లాడడం సరికాదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర నాయకుల వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "ఎటిఎం ఫర్ కెసిఆర్" అని పలు మార్లు అన్నప్పటికీ, ఇప్పుడు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాలేశ్వరం అవినీతి అంశంపై ఘోష్ కమిషన్ ఏర్పాటు చేసినా, సీబీఐకి అప్పగించకుండా బీజేపీ నాయకులు కేసీఆర్‌ను రక్షించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను ఉద్దేశించి, ఢిల్లీలో దోస్తీ-గల్లీలో కుస్తీ అన్నట్లు బిఆర్ఎస్‌తో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం అవినీతిపై నిజాలు బయటపెట్టి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 10వ తేదీన రాష్ట్రానికి రానున్న ప్రధానమంత్రికి స్వాగతం పలుకుతూ, ఇప్పటికే పలుమార్లు కేంద్ర మంత్రులను కలిసినా రాష్ట్రానికి తగిన నిధులు ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, 1956 నుంచి పోరాడి సాధించుకున్న తెలంగాణను పాకిస్థాన్‌తో పోల్చడం తగదన్నారు. అప్పట్లో మూడు రాష్ట్రాలు ఇచ్చినప్పుడు తెలంగాణను ఇవ్వాల్సి ఉండగా ఇవ్వకపోవడం ద్వారా బీజేపీ ద్రోహం చేసిందన్నారు. బీజేపీ నాయకులు తెలంగాణపై అపహాస్యంగా మాట్లాడితే బిఆర్ఎస్ నాయకులు ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. అలాగే బంగారం దుకాణంలో చోరీ జరిగిన ఘటనపై మంత్రులు ఏమి చేస్తున్నారని విమర్శించడం మూర్ఖత్వమని, పోలీసులు దొంగలను పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారని, త్వరలో పట్టుకుంటారని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్‌చైర్మన్ చిత్తారి పద్మరవి, ఏఎంసి చైర్మన్ కంది తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ టౌన్, మే 6, ప్రభాతవార్త : హుస్నాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ డివిజనల్ ఆఫీస్ కాంప్లెక్స్(ఐడీఓసీ)లో ఆర్డీవో కార్యాలయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో రామ్మూర్తితో మాట్లాడి కార్యాలయంలోని సిబ్బంది వివరాలు, పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమస్యల పరిష్కారం కోసం వచ్చే వారికి మానవతా దృక్పథంతో వ్యవహరించాలని మంత్రి సూచించారు. సమయపాలన పాటించడం అత్యంత కీలకమని, ప్రజా సేవలో నిర్లక్ష్యం అసలు సహించబోదని హెచ్చరించారు. అధికారులు ప్రజలకు దగ్గరగా ఉంటేనే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు పారదర్శకంగా ప్రజల్లోకి చేరుతాయని ఆయన తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలు సాధించాలంటే అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. అలాగే ఐడీఓసీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

సంగారెడ్డి అడిషనల్ కలెక్టర్‌గా సంగీత బాధ్యతలు స్వీకరణ

సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 6, ప్రభాతవార్త : సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ)గా టి.ఎల్.సంగీత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రెవెన్యూ శాఖ అధికారులు ఆమెను కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులతో ఆమె సన్నిహితంగా పరిచయం చేసుకున్నారు. అడిషనల్ కలెక్టర్‌గా జిల్లా అభివృద్ధి, రెవెన్యూ పరిపాలనను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని టి.ఎల్.సంగీత తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సంగీత

తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఘనంగా శ్రీరంగనాథస్వామి కళ్యాణోత్సవం

పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, మే 6, ప్రభాతవార్త: అందోలులోని పురాతన ఆలయమైన శ్రీ భూనీళా సమేత రంగనాథస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన శ్రీరంగనాథస్వామి, శ్రీ మురళీక్రిష్ణుల కల్యాణ మహోత్సవంలో మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రికి ఆశీస్సులు అందచేయటంతోపాటు తీర్థప్రసాదాలు అందచేశారు. కాగా, సాయంత్రం నిర్వహించిన విశేష పుష్పార్చన, విశేష ఫలార్చన కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మంత్రివెంట పలువురు కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న స్కూటీ.. వ్యక్తి మృతి

నర్సాపూర్, మే 6, ప్రభాతవార్త : ప్రమాదవశాత్తున స్కూటీ అదుపు తప్పి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన నర్సాపూర్ మండలం ఆవంచ బస్‌స్టాప్ సమీపంలో బుధవారం జరిగింది. ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం... పాపన్నపేట మండలం తమ్మాయిపల్లి గ్రామానికి చెందిన సేవెళ్ల శ్రీనివాస్‌రెడ్డి(57) మేడ్చల్‌లోని కెఎల్ఆర్ వెంచర్‌లో నివాసముంటూ అక్కడే స్థిరపడ్డారు. బుధవారం జోగిపేట సమీపంలోని సంగాయిపేట గ్రామంలో బంధువుల పెళ్లికి స్కూటీపై మేడ్చల్ నుండి సంగాయిపేటకు వెళ్లాడని తెలిపారు. పెళ్లయిన తర్వాత మేడ్చల్‌కు తిరుగు ప్రయాణమై స్కూటీపై వస్తుండగా నర్సాపూర్ మండలం ఆవంచ స్టేజీ సమీపంలోకి రాగానే అదుపుతప్పి చెట్టుకు బలంగా ఢీకొనగా తలకు తీవ్ర గాయాలై స్పృహ తప్పి పడిపోయినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే అక్కడున్న వ్యక్తి ఫోన్ ద్వారా బంధువులకు సమాచారం అందించగా ఇదే పెళ్లికి వెళ్లి వస్తున్న అతని కుమారుడు, బంధువులు సంఘటన స్థలానికి వచ్చి చూడగా శ్రీనివాస్‌రెడ్డి స్పృహ తప్పి పడిపోయినట్లు తెలిపారు. స్పృహతప్పి పడిపోయిన అతడిని వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో డాక్టర్ పరిశీలించగా అప్పటికే శ్రీనివాస్‌రెడ్డి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ కుమార్‌రెడ్డి తెలిపారు

బ్యాంకు రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. గోపి

మాట్లాడుతున్న డాక్టర్ గోపి

నర్సాపూర్, మే 6, ప్రభాతవార్త : రైతులు బ్యాంకులు,సహకార సంఘాలు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారోత్సవాలు మూడవ రోజున నర్సాపూర్‌లోని మార్కెట్ యార్డులో నిర్వహించారు. బ్యాంకుల ద్వారా దీర్ఘకాలిక స్వల్పకాలిక రుణాలు సహకార సంఘాలు ఎఫ్‌పిఒల ద్వారా రైతులకు సేవలు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి, జిల్లా అదనపు కలెక్టర్ మెంచ్ నాగేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపి మాట్లాడుతూ బ్యాంకుల అందించే రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో యూరియా వాడకం రెట్టింపు అయిందని తెలిపారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చే పంటలు సాగు చేయాలని సూచించారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని నేలను కాపాడుకోవాలంటే ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. జిల్లా పిఎండి డీకేవైకు ఎంపికవడంతో రైతులు వ్యవసాయం, అనుబంధ రంగాల్లో చెప్పుకోదగ్గ ప్రగతి సాధించే అవకాశం ఉందన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్ మాట్లాడుతూ రైతులు పంటలపై రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి సారించాలన్నారు. రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అందించే అన్ని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ లీడ్ బ్యాంకు మేనేజర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజుయాదవ్ ధర్మారెడ్డి వ్యవసాయ శాఖ అధికారులు ఎడిఏ సంధ్యారాణి ఏఈవోలతోపాటు రైతు రక్షణ సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మిర్యాల చంద్రశేఖర్ మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్‌గుప్తా సహకార సంఘాల అధికారులు వివిధ బ్యాంక్ మేనేజర్లు, సర్పంచులు ఉప సర్పంచులు, రైతులు పాల్గొన్నారు

హైకోర్టు ఇచ్చిన అదేశాలను చూపుతున్న దృశ్యం

హైకోర్టు ఆదేశాలతో.. పదవులు చేపట్టిన

టేక్మాల్ సొసైటీ పాలక వర్గం

టేక్మాల్, మే 6, ప్రభాతవార్త: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు పాలకవర్గాల పాత కమిటీనే కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో బుధవారం తిరిగి గత పాలక వర్గం కొనసాగుతుంది. టేక్మాల్ సొసైటీ కార్యల యంలో పాలకవర్గ సభ్యులు సమావేశమై బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ యశ్వంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సహకార సంఘా లను రద్దుచేస్తూ ప్రత్యేక అధికారులకు ఇన్‌చార్జిగా నియమించింది. దీంతో సహకార సంఘం రైతుల తో పాటు పాలకవర్గాలు కోర్టును ఆశ్రయించినట్లు ఆయన చెప్పారు. సొసైటీలను నామినేటెడ్ చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారని వారి ఆవేదనను కోర్టుకు విన్నవించినట్టు ఆయన చెప్పారు. ఈ వాదనలువిన్న కోర్టు యధాతథంగా ఎన్నికలు జరిగే వరకు పాత పాలకవర్గ సభ్యులు పదవి చేపట్టాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు తిరిగి పదవిని చేపడుతున్నట్లు చైర్మన్ చెప్పారు. రైతులకు ఏ అవసరమొచ్చినా సహకారం అందించేందుకు ఎల్ల వేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మీ అందరి సహ కారం, ఆశీర్వాదంతోనే ఈ పదవిలో కొనసాగుతు న్నానని, ఈ అవకాశాన్ని రైతు సేవా కార్యక్రమా లకు వినియోగిస్తానని తాను రైతు బిడ్డనే అని ఆయన అన్నారు. సమావేశంలో సంఘ డైరెక్టర్లు, శ్రీశైలం, శ్రీరాములు, సీఈఓ సాయిలు,వేణుగోపాల్, సంఘ సభ్యులు, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరప్ప, నాయకులు సలీం, ముక్తార్, సిద్దయ్య, భాస్కర్, శ్రీనివాస్, అడివప్ప, మోహన్, సాయి బాబా, రైతులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా దరిపల్లి చంద్రం

సిద్దిపేట అర్బన్, మే 6, ప్రభాతవార్త : సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా టిపిసిసి సభ్యుడు, బిఎన్ఆర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రంను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సిద్దిపేట పట్టణానికి చెందిన దరిపల్లి చంద్రం కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకునిగా మంచి గుర్తింపు ఉంది. గతంలో రెండు పర్యాయాలు సిద్దిపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ దక్కినట్లు దక్కి చేజారిపోయింది. దరిపల్లి చంద్రం సిఎం రేవంత్‌రెడ్డి టిడిపిలో ఉన్నంత కాలం ఆయన బాటలోనే నడుస్తూ వచ్చారు. అనంతరం కాంగ్రెస్‌లో రేవంత్‌రెడ్డి చేరడంతో ఆయన సైతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. నాటినుంచి నేటీ వరకు చంద్రం సిఎం రేవంత్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ వస్తున్నారు. దరిపల్లి చంద్రం జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నియామకం కావడంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా శ్రీరామ్‌చక్రవర్తి

హుస్నాబాద్ రూరల్, మే 6, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం పలు రాష్ట్ర కార్పొరేషన్‌లకు చైర్మన్లు, వైస్ చైర్మన్‌లను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి కరీంనగర్‌జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఏపీ హౌస్‌ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించింది. ఈ నియామకంపై కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు, మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన శ్రీరామ్‌చక్రవర్తి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బొమ్మ వెంకటేశ్వర్ కుమారుడు. ఆయనకు రాజకీయ, సామాజిక రంగాల్లో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. బీసీ వర్గాల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తూ పార్టీకి విశేష సేవలు అందించిన నాయకుడిగా గుర్తింపు పొందారు. మున్నూరు కాపు విద్యార్థుల కోసం హాస్టల్ నిర్వహణతో పాటు సామాజిక సేవలో చురుకుగా పాల్గొంటున్న ఆయన నియామకంతో విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం అవుతాయని ఆశాభావం వ్యక్తమవుతోంది. సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇస్తూ బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం శ్రీ రేవంత్‌రెడ్డి నాయకత్వం లో మున్నూరు కాపు కార్పొరేషన్‌కు సమర్థుడైన నాయకుడిని చైర్మన్‌గా నియమించడం శుభపరిణామమని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గారికి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారికి, మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి గారితో పాటు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ శ్రేణులు కృతజ్ఞతలు తెలిపారు.

మృతదేహాల వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు

బట్టలు ఉతికేందుకు వెళ్లి బావిలో పడి తల్లి, ఇద్దరు బాలికల మృతి

కంగ్టి, మే 6, ప్రభాతవార్త: బట్టలు ఉతికేందుకు వెళ్లిన ముగ్గురు ప్రమాదవశాస్తు బావిలో పడి మృతి చెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం బోర్గి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం...బోర్గి గ్రామానికి చెందిన సావిత్రిబాయి (30), కుమార్తె జాదవ్ నిఖిత(12), మరో బాలిక జాదవ్ నందిని(13) బట్టలు ఉతికేందుకు బావివద్దకు చేరుకున్నారు. సావిత్రిబాయి బట్టలు ఉతుకుతున్న తరుణంలో నందిని, నిఖితలు ప్రమాదావశాస్తు కాలు జారి బావిలో పడిపోగా వారిని రక్షించేందుకు సావిత్రిబాయి బావిలోకి వెళ్లగా ముగ్గురు బావిలోని నీటిలో మునిగి మృతి చెందారు. మృతి చెందిన సావిత్రిబాయి హైదరాబాద్‌కు వలస వెళ్లి అక్కడే జీవనం సాగిస్తుండగా ఓ వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు గ్రామానికి వచ్చి బావిలోపడి మృతిచెందారు.బావిలో మునిగి ముగ్గురు మృతి చెందటంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతి చెందిన బాలికలు నిఖిత, నందినిలు మొగుడంపల్లి, సిర్గాపూర్‌లోని వసతి గృహాల్లో ఉంటూ 6వ తరగతిలో విద్యను అర్జిస్తున్నారు. జాదవ్ పర్సురామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సంఘటన స్థలానికి కంగ్టి సిఐ వెంకటరెడ్డి, ఎస్ఐ దుర్గారెడ్డిలు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

డిజిపిని సత్కరించిన కిలారు

సీవీ ఆనంద్‌ను కలిసిన కిలారు రాజేశ్వరరావు

జూబ్లీహిల్స్, మే 6, ప్రభాతవార్త: డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్‌ను జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ మాజీ కార్యదర్శి కిలారు రాజేశ్వరరావు సత్కరించారు. డీజీపీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వ కంగా కలిసిన కిలారు శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. రాష్ట్రంలో వివిధ హోదాల్లో అనేక సేవలందించిన సీవీ ఆనంద్ డీజీపీగా మరింత వన్నె తీసుకురావాలని కోరారు. తెలంగాణ పోలీ సులకు ఉన్న పేరును మరింత ముందుకు తీసుకెళ్లాలని, విప్లవా త్మకమైన మార్పులతో తనదైన ముద్ర వేసుకోవాలని కోరారు.

ధన్వంతరి ఫౌండేషన్ భూములను వేలం వేసి బాధితులకు న్యాయం చేయాలి : గిరిప్రసాద్‌శర్మ

సమావేశంలో మాట్లాడుతున్న గిరిప్రసాద్‌శర్మ

సైఫాబాద్, మే 6 ప్రభాతవార్త: ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ సంస్థపై నాంపల్లి ఎంఎస్ కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఆ సంస్థ ఆస్తులను వేలం వేసి, వచ్చిన మొత్తం డబ్బును బాధితులకు చెల్లించాలని తీర్పు ఇచ్చిందని బాధితుల హక్కుల పరిరక్షణ ట్రస్ట్ తెలిపింది. ఆ సంస్థ ఛైర్మన్ కమలాకర్‌శర్మ, జయశ్రీ, ఇతర మహిళా డైరెక్టర్లు దాఖలు చేసిన స్టే పిటిషన్‌లను హైకోర్టు కొట్టివేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫౌండేషన్ భూముల వేలంపై స్పష్టత ఇవ్వడం లేదని ట్రస్ట్ కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విచారం వ్యక్తం చేశారు. భూలావాదేవీల్లో ప్రమేయం ఉన్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీరంగ అన్నపూర్ణశర్మ, లక్ష్మణ్‌లను ఎఫ్ఐఆర్‌లో చేర్చకపోవడం వెనుక ఉన్న అసలు సంగతి ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఆ ఇరువురిని తక్షణమే అరెస్టు చేసి సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఆయన కోరారు. సత్య జారి, డాక్టర్ జయశ్రీలకు మంజూరు చేసిన బెయిల్‌ను తక్షణమే రద్దు చేయాలని, వారు గనుక బయటకు వస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని, దీంతో న్యాయం అలస్యంగా వస్తుందని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కమలాకరశర్మ, ఇతరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ట్రస్ట్ కో-కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు.

శిల్పకళావేదికలో నాదపరంపర సంగీత మహోత్సవం

150మంది కళాకారులతో గ్రాండ్ వయోలిన్ సింఫనీ

నాంపల్లి, మే 6 ప్రభాతవార్త : ప్రముఖ సాంస్కృతిక వేదిక అరభిది సెంటర్ ఫర్ ఫర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో 9 శనివారం సాయంత్రం 5గంటల నుండి శిల్పకళావేదికలో నాదపరంపర శీర్షికన సంగీత మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధినేత, ప్రముఖ సంగీత విద్వాంసుడు కళారత్న డా. అశోక్ గుర్జాలే పత్రికా ప్రకటనలో తెలిపారు. సంస్థ 28వ వార్షికోత్సవ వేడుకల్లోల భాగంగా నిర్వహిస్తున్న ఈ మహోత్సవంలో సంగీతప్రియులను అబ్బురపరిచేలా 150మంది ప్రముఖ కళాకారులతో గ్రాండ్ వయోలిన్ సింఫని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. చిన్నారుల నుండి యువకళాకారుల వరకు పాల్గొనే ఈ విలక్షణ సంగీత ప్రదర్శన భారతీయ శాస్త్రీయ సంగీత వైభవాన్ని పరిమళింపజేస్తుందని అన్నారు. భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతున్న ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథులుగా పద్మశ్రీ ఎల్లా వెంకటేశ్వరరావు, డా. దీపికారెడ్డి, దారూరి రాఘవాచారి, రాంకుమార్ మోహన్, జి.కిషన్‌రావు, తనికెళ్ళభరణి, డా. జె.అనురాధ, జి.అనురాధరెడ్డి, కళ్యాణి ద్విభాష్యం తదితరులు పాల్గొంటారని వివరించారు. ప్రముఖ మృదంగ విద్వాంసుడు పాలకుర్తి రామచంద్రశర్మను మృదంగ విభూషణ్ బిరుదుతో సత్కరించనున్నట్లు డా. అశోక్ గుర్జాలే పేర్కొన్నారు.

ఎస్ఐఆర్ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోండి


ముఖ్య ఎన్నికల అధికారికి వినతి పత్రం అందజేస్తున్న రాష్ట్ర ఎస్ఐఆర్ సభ్యులు పొన్న వెంకటరమణ

చాంద్రాయణగుట్ట, మే 6, ప్రభాతవార్త : ఓటర్లను మ్యాపింగ్ చేయటంలో బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓలు) చేస్తున్న తప్పిదాలపై సమగ్ర విచారణ జరిపి, ఇంతవరకు హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో జరిగిన ఓటర్ మ్యాపింగ్ వివరాలు అందించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సభ్యులు పొన్న వెంకటరమణ బుధవారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రత్యేకించి కొన్ని ప్రాంతాల్లో ఒక వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు తప్పుడు సమాచారం ఇచ్చి ఓటర్లను తప్పుగా మ్యాప్ చేయిస్తున్నారని వివరించారు. ఒక కుటుంబంలో తండ్రి, కొడుకు, కోడలు, చిన్న పిల్లలు ఉన్నప్పుడు, కోడలిని కూతురిగా చూపిస్తూ తండ్రితో ఓటును మ్యాప్ చేయడం జరిగిందన్నారు. శాలిబండ డివిజన్‌లో పెద్ద సంఖ్యలో ఈ విధమైన లోపాలు గుర్తించినట్లు ఉదహరించారు. తన కుటుంబానికి సంబంధించిన ఓటర్ను రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన ఓటర్‌తో తప్పుగా మ్యాప్ చేశారని, విషయం తెలిసి రాజేంద్రనగర్ బీఎల్ఓను సంప్రదించి, అక్కడ నుండి అన్‌మ్యాప్ చేయించి తిరిగి సరైన ప్రాంతానికి మ్యాప్ చేయించుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీసం 12 కంప్యూటర్లు మరియు నైపుణ్యం గల ఆపరేటర్లను ఏర్పాటు చేసి, ఎస్ఐఆర్ మ్యాపింగ్ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కేశవగిరిపై నేత్రపర్వంగా లక్ష్మీచెన్నకేశవుల కల్యాణం


లక్ష్మీచెన్నకేశవుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

చాంద్రాయణగుట్ట, మే 6, ప్రభాతవార్త : చాంద్రాయణగుట్ట కేశవగిరిపై వెలసిన స్వయంభుః శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానం ఆవరణలోని కల్యాణ మండపంలో బుధవారం లక్ష్మీచెన్నకేశవుల కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు కంజర్ల ప్రతాపాచార్యుల పర్యవేక్షణలో అర్చక స్వాములు కంజర్ల ప్రణయ్ కుమారాచార్యుల ఆధ్వర్యంలో దమ్మాయగూడ రాజశేఖర్, మీనాకుమారి దంపతులు స్వామి వార్ల కల్యాణాన్ని జరిపించారు. అర్చకస్వాముల మంత్రోచ్ఛారణల మధ్య స్వామి వారు అమ్మవారి మెడలో మంగళ సూత్రధారణ చేశారు. ఒకరిపై ఒకరు తలంబ్రాలు పోసుకున్నారు. చూడ ముచ్చటైన కల్యాణాన్ని తిలకించేందుకు సమీప బస్తీల భక్తులు హాజరైయ్యారు. అంతకుముందు ఆలయంలో కొలువైన స్వామి వార్లకు విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులు లక్ష్మీచెన్నకేశవులను దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కన్నులపండువగా శ్రీనివాసుడి కల్యాణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా పూజాది కార్యక్రమాలు నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి, మే 6 ప్రభాతవార్త: వేదపండితులు మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ కలియుగప్రత్యక్షదైవం శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం బుధవారం ఆలయం వ్యవస్థాపక వంశీయులు గుడిదేవుని శ్రీనాథ్‌గౌడ్, ఈవో, సహాయ కమిషనర్ వి.అంబుజ సమక్షంలో రమణీయంగా సాగింది. కళ్యాణోత్సవం సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, పుణ్యాహవాచనము, బిందెతీర్థము, బాలభోగము, బలిహరణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకీసేవ కార్యక్రమాన్ని శోభాయమానంగా నిర్వహించారు. మహానివేదన, హారతి, మంత్రపుష్పం కార్యక్రమం జరిగింది. అనంతరం ప్రబంధపారాయణం, మహానివేదన, హవనం, హారతి, మంత్రపుష్పం జరిగింది. కల్యాణోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ముందుగా ఎదురుకోళ్ళు, అనంతరం స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన అలివేలుమంగా సమేత ఈ ఉత్సవాన్ని పాంచరాత్రాగమ శాస్త్రానుసారంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయం వ్యవస్థాపక వంశీయులు స్వర్గీయ గుడిదేవుని రాజేంద్రనాథ్‌గౌడ్ సతీమణి జి.సువర్ణలత, కుమారుడు జి.శ్రీనాథ్‌గౌడ్-జి.కీర్తి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గరుఢవాహనసేవ

కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం గరుఢవాహనసేవ ఉంటుందని ఆలయం అలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో, సహాయ కమిషనర్ అంబుజ వివరించారు. ఉదయం సుప్రభాతసేవ, పుణ్యాహవాచనము, బిందెతతీర్థము, హవనము, బలిహరణం, బాలభోగము, మంత్రపుష్పము, పల్లకీసేవ, మహానివేదన, వేదపారాయణాలు, ద్రావిడ ప్రబంధము ఉంటుంది. సాయంత్రం జరిగే వాహన సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కంటితుడుపుగా కెమేరాలు.. భద్రతకు తిప్పలు!

-పనిచేయని సీసీ కెమేరాలు.. పట్టించుకోని పోలీసులు

-చీకటి పడితే జనం బేజారు.. చిక్కడపల్లి పరిధిలోని కాలనీల దీనస్థితి

చిక్కడపల్లి, మే 6 ప్రభాతవార్త : నేరాల నియంత్రణలోనూ, నిందితులను పట్టుకోవడంలోనూ సీసీ కెమెరాలు అత్యంత కీలకం. కానీ చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో మాత్రం పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన కెమెరాలు నేడు మూలపడ్డాయి. ఫలితంగా స్థానిక ప్రజలు భద్రత లేక భయం భయంగా గడుపుతున్నారు. ప్రధానంగా అచ్చయ్యనగర్, పద్మా కాలనీ, బృందావన్ కాలనీ, ఇందిరా కాలనీ తదితర ప్రాంతాలలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం గతంలో భారీగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో ఆర్భాటం చేసిన పోలీసులు, ఆ తర్వాత వాటి నిర్వహణను గాలికి వదిలేశారు. గత రెండు సంవత్సరాలుగా ఈ కెమెరాలు మొరాయించి ఉన్నా, వాటిని బాగు చేసే నాథుడే కరువయ్యారు. ప్రజలకు చేరువగా ఉంటూ భద్రత కల్పిస్తామన్న ఫ్రెండ్లీ పోలీసింగ్ మాట ఇక్కడ ఎక్కడా కనిపించడం లేదు. కెమెరాలు పనిచేయకపోవడంతో గొలుసు దొంగతనాలు, వాహనాల చోరీల భయం కాలనీ వాసులను వెంటాడుతోంది. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే ఆధారాల కోసం వెతకాల్సిందే తప్ప, నిఘా నేత్రాల ద్వారా నిందితులను పట్టుకునే పరిస్థితి లేదని స్థానికులు వాపోతున్నారు.

కాగా కాలనీలో కెమెరాలు ఉండి కూడా లేనట్టే. రెండేళ్లుగా అవి పనిచేయడం లేదని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. అసాంఘిక కార్యకలాపాలు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా చిక్కడపల్లి పోలీసులు స్పందించి కొత్త కెమెరాలు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

గ్యాస్ డెలివరీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

-కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరిచందనకు వినతి

సెక్రటరీ హరిచందనకు వినతిపత్రం ఇస్తున్న చిరంజీవులు, రాజు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, మే 6,ప్రభాతవార్త: కుకింగ్ గ్యాస్ డెలివరీ బాయ్స్ ఎదుర్కొంటున్న సమస్యలను నెల రోజులలోపు పరిష్కరించేందుకు కృషి చేస్తామని కార్మిక శాఖ కార్యదర్శి దాసరి హరి చందన హామీ ఇచ్చారు. బుధవారం తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సలహాదారు కమిటీ చైర్మన్ మాజీ ఐఎఎస్ అధికారి టి చిరంజీవులు ,కమిటీ నాయకులు చామకూర రాజు, అధ్యక్షులు నకిరేకంటి శ్రీనివాస్ గౌడ్ కార్యదర్శులు అజయ్ రెడ్డి ,నగేష్ గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ నాయకులు యునుస్ తదితరులు సెక్రటేరియట్‌లో ఎల్.పీ.జీ డెలివరీ బాయ్స్ ఎదుర్కొంటున్న సమస్యలు హరిచందన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ .టి చిరంజీవులు మాట్లాడుతూ ఎల్.పీ.జీ డిస్ట్రిబ్యూటర్లు సిలిండర్లు సరఫరా చేసే కార్మికులకు కనీస జీతాలు చెల్లించడం లేదన్నారు. ఈ ఎస్ఐ ,పిఎఫ్ లు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో 806 గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూషనర్లు ఉన్నారని వారు కార్మిక శాఖ ఇతర ప్రభుత్వ శాఖనియమాలను పాటించ కుండా శ్రమదోపిడికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐడెంటిటీ కార్డులు అపాయింట్మెంట్ లెటర్ కూడా ఇవ్వడం లేదని కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రంలో 806 గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూషనర్లు ఉన్నారని వారు కార్మిక శాఖ ఇతర ప్రభుత్వ శాఖలను నియమాలను పాటించకుండా కార్మికుల శ్రమదోపిడికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కార్మికులకు వివిధమైన ముందస్తు సమాచారం లేకుండా అక్రమంగా తొలగిస్తున్నారని వారాంతపు సెలవులు కూడా ఇవ్వడం లేదని అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి హరిచందన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై స్పందించి డిస్ట్రిబ్యూటర్లకు కార్మిక శాఖ తరపున నోటీసులు పంపిస్తామని డిస్ట్రిబ్యూటర్లతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

మంత్రి కొండా సురేఖ క్షమాపణలు చెప్పాలి

- బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చికోటి ప్రవీణ్

జూబ్లీహిల్స్, మే 6, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూ ధర్మరక్ష వ్యవస్థాపకులు డాక్టర్ చికోటి ప్రవీణ్ డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖ జై శ్రీరాం అనే పవిత్ర నినాదాన్ని డబ్బుతో పోల్చడం హిందూ ధర్మంపై దాడి అని అన్నారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉండి దైవ విశ్వాసాలను అవమానించడం దురదృష్టకరమన్నారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలను ఆమె దెబ్బతీశారని, దీనికి కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలన్నారు. దైవాన్ని అవమానించిన వారికి ప్రజలు తప్పనిసరిగా గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు.

వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం హుండీ ఆదాయం రూ.2 లక్షల 5 వేల 395

వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం హుండి లెక్కింపు నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి, మే 6 ప్రభాతవార్త: వివేక్ నగర్ ఆంజనేయస్వామిదేవాలయంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. ఆలయం పునర్ నిర్మాణ కమిటీ చైర్మన్ సుధాకర్, ఈవో మాచర్ల దేవనాథం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సురేఖ పర్యవేక్షణలో లెక్కించారు. 30 రోజు లకు గాను రూ. 2 లక్షల 5 వేల 395 ఆదాయం వచ్చింది. దేవాలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, కందాళ వెంక టాద్రి భక్తులు పాల్గొన్నారు.

మద్యం వ్యసనంతో ప్లంబర్ మృతి

పేట్ బషీరాబాద్, మే 6, ప్రభాతవార్త: పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం వ్యసనంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. అడ్డేపు అనిల్ కుమార్ (38) అనే వ్యక్తి వృత్తిరీత్యా ప్లంబర్‌గా పనిచేస్తూ, శ్రీరామ్ నగర్ కాలనీ, చింతల్‌లో తన అక్క ఇంట్లో నివసిస్తున్నాడు. ఇతని స్వగ్రామం వరంగల్ జిల్లా, కనిమాబాద్ మండలం ఎస్.ఆర్ తోట గ్రామం.స్థానికంగా ప్లంబింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అనిల్ కుమార్ మద్యం అలవాటుకు బానిసగా మారినట్లు సమాచారం. ప్రతిరోజూ అధికంగా మద్యం సేవించడం వల్ల ఆరోగ్యం క్షీణించింది.ఈ క్రమం లో బుధవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుం బ సభ్యులు తెలిపారు.సమాచారం అందుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

చైర్మన్ గుంజ రేణుకనారాయణను సన్మానిస్తున్న వేముల లోకేష్ తదితరులు

హదరాబాద్, మే 6,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన వడ్డెర కార్పొరేషన్ సొసైటీనికి నూతనంగా చైర్మన్ గా ఎన్నికైన గుంజ రేణుక నారాయణను అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ యువజన అధ్యక్షుడు డాక్టర్ వేముల లోకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా చైర్మన్ దంపుతలకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా వేముల లోకేష్ మాట్లాడులూ అఖిలభారత వడ్డెర సంఘం అభివృద్ధి కృషి చేయాలని కోరారు. అలాగే వడ్డెరల సమస్యలను చైర్మన్ దృష్టి తీసుకురావాలని సంఘం ప్రతినిధులకు పిలుపునిచ్చారు. వడ్డెర యువత పెడదారిన పట్టకుండా ప్రభుత్వ పథకాలను సద్వినిచేసుకోవాలని లోకేష్ కోరారు.

భార్యాభర్తల గొడవలతో మనస్థాపం - యువకుడు మృతి

పేట్ బషీరాబాద్, మే 6, ప్రభాతవార్త: భార్యాభర్తల గొడవలతో మనస్థాపం భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుండ్ల పోచంపల్లి ప్రాంతానికి చెందిన నల్లూరి సాయికుమార్ (28) వృత్తి కార్ డ్రైవర్.సుమారు ఏడు సంవత్సరాల క్రితం అనుష (25)తో సాయికుమార్‌కు వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు (ఒక పాప, ఒక బాబు) ఉన్నారు. వివాహం జరిగిన తొలి సంవత్సరం వరకు దాంపత్య జీవితం సవ్యంగా సాగినా, అనంతరం భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది.వారం రోజుల క్రితం జరిగిన గొడవ అనంతరం భార్య అనుష తన తల్లి ఇంటికి బహదూర్‌పల్లికి వెళ్లింది. ఈ నేపథ్యంలో మే 5, 2026 రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో సాయికుమార్ తన స్నేహితుడికి వాట్సాప్ ద్వారా సందేశం పంపాడు. అనంతరం స్నేహితుడు ఇంటికి వెళ్లి చూడగా, సాయికుమార్ ఉరివేసుకున్న స్థితిలో కనిపించాడు.ఇదివరకు కూడా సాయికుమార్ రెండుసార్లు ఆత్మహత్యకు ప్రయత్నించగా, స్థానికులు, అతని స్నేహితుడు కాపాడినట్లు సమాచారం. భార్యాభర్తల మధ్య ఉన్న విభేదాల కారణంగా మనస్థాపానికి గురైఈ ఘటనకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కురుమల అభివృద్ధికి 18ఏళ్లుగా ఎనలేని కృషి

-సంఘం ప్రతిష్ట దెబ్బతీసేలా దుష్ప్రచారం సరికాదు

-రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌సి ఎగ్గె మల్లేశం

ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఎగ్గెమల్లేశం, క్యామ మల్లేశ్, చీర శ్రీకాంత్, నారాయణ తదితరులు

హైదరాబాద్, మే 6,ప్రభాతవార్త: కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి 18 సంవత్సరాలలో పలు ప్రధాన ఆలయాల వద్ద వసతి గృహాలు ముస్లింలను వంతెన వద్ద విద్యార్థి వసతిగృహం ఇలా దాదాపు రెండు వేల కోట్ల రూపాయల ఆస్తులను కూడబెట్టగలిగినట్లు రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు, సంఘం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ మల్లేశం పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మధ్యకాలంలో సామాజిక మాధ్యమాల ద్వారా కురుమ సంఘం ప్రతిష్టను దెబ్బతీసేలా కొందరు వ్యవహరిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. ముస్లిం జంగ్ వంతెన వద్ద ఉన్న కురుమ సంఘం భవనాన్ని సంఘానికి చెందిన ఓ నాయకుడు నేలమట్టం చేస్తే కురుమలు ఏసమావేశం నిర్వహించుకోవాలన్నా నిలువ నీడ లేకుండా పోయిందని తాను సొంతంగా 50 లక్షలు, సంఘం ద్వారా చీటీల తో 40 లక్షల పెట్టి భవన నిర్మాణం పూర్తి చేసుకోగా ప్రస్తుతం అద్దె లభిస్తుందన్నారు. 2008 సంవత్సరంలో ఆనాటి కురుమ పెద్దలు సంఘం అధ్యక్షుడిగా ఉండాలని కోరగా తాను ఎన్నికలలో పోటీ చేసి వచ్చానని దొడ్డిదారిన రాలేదన్నారు. అదే విధంగా యాదాద్రి, కొమురవెల్లి లలో దాతల సహకారంతో స్థలాన్ని కొనుగోలు చేసి వసతి గృహాలను నిర్మించినట్లు తెలిపారు. మన్సూరాబాద్ లో మూడు ఎకరాల 10 గుంటల స్థలంలో 2014 సంవత్సరంలో బిర్లా ఓపెన్ మైండ్ పాఠశాల నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందన్నారు. అయితే పాఠశాల భవన నిర్మాణం కోసం నాటి సిఎం ,మంత్రి సహకారంతో దాదాపు కోటి రూపాయలకు పైగా భవన నిర్మాణ ఫీజును మినహాయింపు తీసుకోవడం జరిగిందన్నారు.. ప్రస్తుతం ఆ భవనం నుంచి ప్రతినెల అద్దె వస్తుందని తెలిపారు. కానీ ఇవన్నీ ఏమీ తెలియని కొందరు సంఘం గురించి రకరకాలుగా మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. కుల ప్రతిష్టను దిగ జార్చేలా వ్యవహరిస్తే కులస్తులు ఊరుకోరని ఎవరికైనా అనుమానాలు ఉంటే సంఘం కార్యాలయానికి వస్తే వారికి అన్ని చూపించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లేశం,చీర శ్రీకాంత్, బండారి నారాయణ, కొలుపుల నరసింహ, తూముకుంట అరుణ్ కుమార్, రెక్కల కొండల రాజ్, శ్రీనివాస్, బాలమని,విజయలక్ష్మి మిర్యాల విజయ తదితరులు పాల్గొన్నారు.

బిజెపిని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి : భరత్ గౌడ్

సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద బిజెపి వాల్ పేయింటింగ్‌ను ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ తదితరులు

కంటోన్మెంట్,మే 6 ప్రభాతవార్త: గ్రేటర్‌లో బిజెపిని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు,నాయకులు సైనికుల్లా పనిచేయాలని మహంకాళి జిల్లా బిజెపి అధ్యక్షుడు భరత్ గౌడ్ తెలిపారు. కంటోన్మెంట్ 4వ వార్డుకు చెందిన బిజెపి సీనియర్ నాయకుడు నాగభూషణ్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద ఏర్పాటు చేసిన వాల్ పేయింటింగ్స్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భరత్ గౌడ్ మాట్లాడుతూ ఈనెల 10న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు,నాయకులు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు. సామాన్య కార్యకర్తలు, సిఎంలు,పీఎంలు అయిన చరిత్ర బిజెపికే ఉందన్నారు. తెలంగాణలో బిజెపికి ఎలాంటి నాయకత్వ లోపం లేదన్నారు. దేశంలో మోదీ చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై బిజెపిలో చేరుతున్నారన్నారు. ఇటీవల 5 రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 3 రాష్ట్రాల్లో బిజెపి అధికారంలోకి వచ్చిందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు విజయానంద్,టోపీ శంకర్,సతీష్, రాఖేశ్,శ్రావన్,అరుణ్, ప్రభాకర్, సంతోష్, విజయరామారావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌కు ఎయిర్ కూలర్ల వితరణ

నిమ్స్ డైరెక్టర్‌తో నవయువ నిర్మాణ సంస్థ సభ్యులు.

జూబ్లీహిల్స్, మే 6, ప్రభాతవార్త: నిమ్స్ ఆసుపత్రిలో రోగుల సేవార్థం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ ఆధ్వర్యంలో కొనసాగే నవయువ నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ కూలర్లను అందించింది. వేసవి నేపథ్యంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి బంధువులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఏడు ఎయిర్ కూలర్లను అందించారు. ఎమ్మెల్యే తరుపున నవయువ నిర్మాణ్ ప్రతినిధులు ఆయా కూలర్లను నిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్పకు అందించారు. పేదలకు సాయం అందించేందుకు పెద్దమనుసుతో ముందుకొచ్చిన సంస్థ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు నారికేల నరేష్, దినేష్, విక్రమ్ యాదవ్, మనోహర్, కార్తిక్‌లతోపాటు ఆసుపత్రి అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌రైటింగ్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల

వాల్‌రైటింగ్‌లో మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి.

జూబ్లీహిల్స్, మే 6, ప్రభాతవార్త: ఈ నెల 10న ప్రధాని మోడి తెలంగాణాకు వస్తున్న నేపథ్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు సంబంధించిన ప్రచార కార్యక్రమంలో బుధవారం ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఇందులో భాగంగా ప్రధాని రాకను ఆహ్వానిస్తూ చేపట్టిన వాల్‌రైటింగ్‌లో ఆయన పాల్గొని స్వయంగా రంగులు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బహిరంగ సభకు ప్రజలు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, బీజేపీ నాయకులు గడ్డం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా బోయ నగేష్

చార్మినార్,మే 6 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీకి చెందిన చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ బోయ నగేష్ వాల్మీకి బోయ కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు.రు.తెలంగాణ రాష్ట్రంలోని పలు నామినేటెడ్ పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.రాష్ట్రంలోని 17 కార్పొరేషన్లకు చైర్మన్లతో పాటు వైస్ చైర్మన్లను బుధవారం నియమించింది.కాగా చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ బోయ నగేష్ వాల్మీకి బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు.వాల్మీకి బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు బోయ నగేష్ ధన్యవాదాలు తెలియజేశారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా భాస్కర్

చార్మినార్,మే 6 ప్రభాతవార్త : పాతబస్తీ యాకుత్‌పుర నియోజకవర్గానికి చెందిన టిపిసిసి ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్ మున్నూరు కాపు కో ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. రాష్ట్రంలోని 17 కార్పొరేషన్ల చైర్మన్లు,వైస్ చైర్మన్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.కాగా ఎన్నో ఏళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం కృషి చేస్తున్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్ మున్నూరు కాపు కో ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు.ఈ సందర్భంగా అల్లం భాస్కర్ మాట్లాడుతూ తనను మున్నూరు కాపు కార్పొరే షన్ వైస్ చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలిపారు..కాగా పాతబస్తీలోని ఇద్దరు కాంగ్రెస్ నాయకులకు కార్పొరేషన్ వైస్ చైర్మన్ల పదవులు లభించాయి.

ఈవెంట్స్ నిర్వాహకురాలికి వేధింపులు..కేసు నమోదు

జూబ్లీహిల్స్, మే 6, ప్రభాతవార్త: ఒక వేడుకల నిర్వాహకురాలిని మోసం చేయడమే కాకుండా బెదిరింపులు, వేధింపులకు పాల్పడుతున్న ఒకరిపై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. మణికొండలో ఒక యువతి(24) ఈవెంట్ ఆర్గనైజర్‌గా పనిచేస్తోంది. ఫిబ్రవరి 27న షాఫ్ట్ అకాడమీలో యాంకరింగ్ శిక్షణ కోసం వెళ్లిన సమయంలో అక్షయ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది.ఆమెకు దగ్గరైన అక్షయ్ ఆమె పుట్టినరోజున మొబైల్ ఫోన్ తీసుకుని వ్యక్తిగత వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు తీసుకున్నాడు. అనంతరం ఆమెను బ్లాక్‌మెయిల్ చేస్తూ సంబంధం పెట్టుకోవాలని ఒత్తిడి చేశాడు. ఆమెను బెదిరించి దాదాపు రూ. 2 నుంచి 3 లక్షలు తన ఖాతాలో వేయించుకున్నాడు. వేర్వేరు నంబర్ల నుంచి ఆమెకు బెదిరిపు సందేశాలు పంపుతూ భయాందోళనలకు గురి చేశాడు. ఆమె ఇంటికి వెళ్లి మరి ఆమెను వేధించాడు. మంగళవారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని రాఘవేంద్ర మెస్ వద్ద తన సోదరుడు, స్నేహితులతో ఉన్న సమయంలో అక్కడికి చేరుకున్న అక్షయ్, ఆమె ఫోన్ లాక్కొని చెంపదెబ్బ కొట్టడమే కాకుండా అసభ్యంగా ప్రవర్తిస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడు. తన ఫోటోలు, వీడియోలను దుర్వినియోగం చేశాడని, బ్యాంక్ కార్డులను ఉపయోగించుకున్నాడని, మొబైల్‌ను హ్యాక్ చేసి లోకేషన్ ట్రాక్ చేశాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి వద్ద ఉన్న మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, పెన్ డ్రైవ్‌లు, సంబంధిత ఖాతాలను స్వాధీనం చేసుకోవాలని బాధితురాలు ఫిర్యాదులో కోరారు.

అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త

సంజీవరెడ్డి నగర్, మే 6, ప్రభాతవార్త: హైదరాబాద్ నగరంలోని ఫతేనగర్ శివశంకర్ కాలనీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. అనుమానంతో భర్త భార్యను హత్య చేసిన సంఘటన సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సనత్ నగర్ ఇన్స్‌పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రం జాజ్‌పూర్ జిల్లా వాసులైన చంద్ర బాను సమల్ (39), సస్మిత సమల్ (34) దంపతులు తమ ఇద్దరు పిల్లలు చందన్ (12), చందిని (9)తో కలిసి గత ఒక సంవత్సరం నుంచి శివశంకర్ కాలనీలో నివసిస్తున్నారు. మే 5, 2026 రాత్రి సుమారు 8 గంటల సమయంలో, భార్య ఇతరులతో మాట్లాడుతోందనే అనుమానంతో చంద్ర బాను ఆగ్రహానికి లోనై ఆమెపై దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన సస్మిత అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను తొలుత బీబీఆర్ ఆసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి మార్చారు. అక్కడ చికిత్స పొందుతూ మే 6 తెల్లవారుజామున సుమారు 3 గంటలకు ఆమె మరణించింది. ఈ ఘటనపై సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ లో హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలి పారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

డ్రగ్స్ విక్రయించేందుకు ప్రయత్నించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అరెస్ట్

బేగంపేట మే 6,ప్రభాతవార్త: బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలో ఎండిఎం మాదక ద్రవ్యాన్ని విక్రయించేందుకు ప్రయత్నించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బేగంపేట పోలీసులు అరెస్ట్ చేసారు.పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.యూసఫ్ గూడా కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అవినాష్(25) డ్రగ్స్ వ్యసనానికి బానిసయ్యాడు. అవసరమైన వానికి డ్రగ్స్ కూడా సరఫరా చేసేవాడు.బేగంపేటలోని వాట్సప్ పాన్ షాప్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన అవినాష్ ను బేగంపేట పోలీసులతో కలిపి టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.అతని వద్ద నుంచి 3గ్రాముల ఎండిఎం మాదక ద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అర్చన ట్రావెల్ యజమానిపై కేసు నమోదు

ముషీరాబాద్, మే 6, ప్రభాతవార్త: టూర్లకు తీసుకువెళ్తామంటూ అనేక మంది నుంచి డబ్బులు వసూలు చేస్తూ మోసం చేస్తున్న అర్చన ట్రావెల్స్ యజమాని భోజరెడ్డిపై దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. సీఐ అంజద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం బండ్లగూడకు చెందిన పరమేశ్‌రెడ్డి(43) అనే వ్యక్తి గోవా ట్రిప్పు కోసం జస్ట్ డయల్‌లో విచారించగా, హిమాయత్‌నగర్‌లోని అర్చన ట్రావెల్స్ నుంచి ఫోన్ వచ్చింది. ఆరుగురు గోవా వెళ్లేందుకు 55వేలు అవుతుందని అర్చన ట్రావెల్స్ వారు తెలిపారు. మార్చి 23వ తేదీ గోవా వెళ్లేందుకు, ఫిబ్రవరి 28వ తేదీ పరమేశ్వర్‌రెడ్డి 55వేల రూపాయలు అర్చన ట్రావెల్స్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. మార్చి 23వ తేదీ గోవా వెళ్లేందుకు అర్చన ట్రావెల్స్ ఏర్పాట్లు చేయకపోవటంతో ఏప్రిల్ 4వ తేదీ పరమేశ్వర్‌రెడ్డి అర్చన ట్రావెల్స్ కార్యాలయానికి వచ్చి, ప్రశ్నించటంతో 25 వేల రూపాయలు ట్రావెల్ యజమాని భోజిరెడ్డి చెల్లించి, మిగతా డబ్బు ఇస్తానని చెపుతూ కాలం గడుపుతూ ఉండటంతో, బుధవారం దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రైతు వారోత్సవాలలో మాట్లాడుతున్న విజయ్‌రెడ్డి

ఘనంగా రైతు వారోత్సవాలు

తొగుట, మే 6,ప్రభాతవార్త : ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో కమిటీ చైర్మన్ చెరుకు విజయ్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం రైతు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎంసి చైర్మన్ చెరుకు విజయ్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ అవకాశాలు బ్యాంకుల ద్వారా దీర్ఘకాలిక స్వల్పకాలిక పంట రుణాలుపైన రైతులకు అవగాహన కల్పించారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ సర్కార్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్‌చైర్మన్ కొంగరి నరసింహులు, ఆత్మకమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, మార్కెట్ కార్యదర్శి స్వామి, ఎవో మోహన్, పిఎసిఎస్ కార్యదర్శి గంగారెడ్డి, ఎస్‌బిఐ బ్యాంకు మేనేజర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

ఎఎంసి చైర్మన్ మీసం మహేందర్‌యాదవ్

రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

చిన్నకోడూరు, మే 6, ప్రభాతవార్త : రైతును రాజు చేయడమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యమని ఎఎంసి చైర్మన్ మీసం మహేందర్‌యాదవ్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం నిర్వహించిన రైతు వారోత్సవాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు ఆయిల్‌ఫామ్ సాగు,పట్టు పురుగుల పెంపకం,రైతుల పంటలకు సబ్సిడి రుణాలపై అవ గాహన కల్పించారు. ఈ సందర్భంగా చంద్లాపూర్ గ్రామానికి చెందిన పట్టు పురుగుల పెంపకం చేసి మంచి లాభాలు గటించిన రైతు పెద్దోళ్ల ఐలయ్య, చిన్నకోడూరు రైతు అశోక్‌రెడ్డిలను శాలువాలతో ఘనంగా సత్కారించారు. రైతులను చైతన్యపరుస్తూ..రైతు పంటల విషయంలో అవగాహనా కల్పించి అభివృద్ధి చేసేందుకు గ్రామస్థాయిలో అన్ని శాఖల వ్యవసాయ అధికారుల తో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సెరికల్చర్ ఆఫీసర్ ఐలయ్య, ఆయిల్‌ఫామ్ ఫీల్డ్ ఆఫీసర్ అర్చన, ఎఈవో శివ, యూనియన్ బ్యాంక్ మేనేజర్, డీసీసీబీ చిన్నకోడూరు బ్రాంచ్ మేనేజర్ రమేష్, ఎఎంసి చైర్మన్లు భూపతిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి, నముండ్ల వినోద్, తాళ్లపల్లి రాజు, పార్టీ నాయకులు రాజేష్, ఉడుతా జయంత్, చంద్రశేఖర్, చంద్,రాజు, స్వామి, హరిబాబు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గౌరవం

బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రతాప్‌రెడ్డి

మండల టాపర్ విద్యార్థిని సుహానాను సన్మానిస్తున్న ప్రతాప్‌రెడ్డి

కొండపాక, మే 6, ప్రభాతవార్త : చదువుతోనే మనిషికి సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయని బిఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం కొండపాక మండల పరిధిలోని సిర్సనగండ్ల ఉన్నత పాఠశాలలో చదివి ఇటీవల్ల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని మహ్మద్ సుహానాను ఆయన శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరింత కృషితో ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, ఉన్న ఊరికి, మండలానికి, జిల్లాకు మంచిపేరు తెవాలని అయన కోరారు. అంతకు ముందు అదే గ్రామంలో మడలేశ్వర స్వామి, సీతలమ్మ, విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట నూనె కుమార్, ఎర్రోళ్ల కనకయ్య, సముద్రాల ఆంజనేయులు, వార్డు సభ్యురాలు భవాని శ్రీరాములు, రాముల భాను, రహీముద్దీన్, సముద్రాల నర్సింలు, రజక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎఎంసి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎఎంసి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక, మే 6, ప్రభాతవార్త : రైతులు బ్యాంకుల రుణాలను సద్వి నియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కొండపాక మార్కెట్ కమిటీ అధ్య క్షుడు విరుపాక శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో ప్రజపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం యూనియన్ బ్యాంకు, కో ఆపరేటివ్ బ్యాంకు మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన క్రాప్ లోన్స్, సబ్సిడీ లోన్స్, మార్టిగేజ్ లోన్స్ గురించి రైతులతో చర్చించారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్ బట్ట పర్శ రాములు, డైరెక్టర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకిలో సైబర్ జాగృత దివస్

బెజ్జంకి, మే 6, ప్రభాతవార్త : మండల కేంద్రంలో బుధవారం సైబర్ జాగృత దివస్ కార్యక్రమంలో భాగంగా పోలీసు స్టేషన్ పరిధిలోని పంచా యతీ ఆవరణలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐపిఎల్ టికెట్ బుకింగ్ మోసాలు, గుర్తింపు దొంగతనం క్రెడిట్/డెబిట్ కార్డు మోసాలు, లోన్ యాప్‌ల వేధింపులు, బ్లాక్ మెయిలింగ్ వంటి సమస్యల పట్ల ప్రజల అవగాహన కల్పించారు.



సైబర్ జాగృత దివస్ నిర్వహిస్తున్న పోలీసులు

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి

పూడూరు, మే 6, ప్రభాతవార్త: దేవాలయాల అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీటవేస్తుందని పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పూడూరు మండలం పరిధిలోని అంగడి చిట్టంపల్లి గ్రామంలో శ్రీశివాలయం 24వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం జరిగిన పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివాలయం ప్రాంగణంలో ఎస్‌డిఎఫ్ కింద మంజూరైన రూ.10 లక్షల నిధులతో నూత నంగా నిర్మించిన షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవచింతనకు ప్రతి ఒక్కరు కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు.గ్రామస్తుల విన్నపం మేరకు ఆలయం ప్రాంగణంలో బండలు వేసేందుకు రూ.5 లక్షల నిధులను మంజూరు చేస్తానని, ఆలయంలో తాగు నీటి కొరత తీర్చేందుకు బోరుబావిని వేయిస్తానని హామీ ఇచ్చారు. తొలుత శివాలయంలో వేదపండి తుల మంత్రోత్సరణలు, బాజాభజంత్రీల మధ్య శివపార్వుతుల కళ్యాణం జరిగింది. ఈ సందర్భంగా

పూడూరు మండలం అంగడి చిట్టంపల్లిలో శివపార్వతుల కళ్యాణం జరుగుతున్న దృశ్యం

వివిధ గ్రామాల భక్తులు భారీసంఖ్యలో హాజరై స్వామివారినిదర్శించుకొని పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల భజన మండలీలు పాల్గొని రాకమచెర్ల శ్రీవెంకటదాసులవారి సంకీర్త నలు ఆలాపించారు. భక్తులకు పూజారులు తీర్థ ప్రసా దాలు అందజేయగా, కాట్న జంగయ్య కుటుంబీ కులు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధన్నగారి యాదవరెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, పిఎ సిఎస్ మాజీ చైర్మన్‌లు రఘునాథ్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేందర్,వివిధ పార్టీల నాయకులు అమర్‌నాథ్, శకీల్, లక్కం సత్యనారాయణ పాల్గొన్నారు.

యువ నాయకుడి మృతికి ఘననివాళులు

జహీరాబాద్, మే 6, ప్రభాతవార్త:

బిఆర్ఎస్ యువనాయకుడు కనుకుంట్ల శ్రీకాంత్ అకాలమరణం స్థాని కంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం, మున్సిపల్ చైర్మన్ ఎండి యూనుస్, కౌన్సిలర్ అరుణ్‌కుమార్ తదితరులు శ్రీకాంత్ నివాసానికి చేరుకుని ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు శ్రీకాంత్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.యువనాయకుడిగా ఎదుగుతున్న శ్రీకాంత్ మృతి ఎంతో బాధాకరమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శేరి అశోక్, గద్దం జనార్దన్, ఎస్.గోపాల్, పండరీ, రాజ్‌కుమార్, శామ్, బి.దిలీప్, కర్దాస్ మనోహర్, ఉల్లిగడ్డ వీర్‌శెట్టి, శేఖర్ పాల్గొన్నారు.

ప్రమాదబాధిత కుటుంబాలను ఆదుకుంటాం

షాబాద్,మే 6, ప్రభాతవార్త : నిరుపేద ప్రమాద బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. షాబాద్ మండలం చందనవెల్లి గ్రామానికి చెందిన మంగలి మహేష్ గత సంవత్సరం పరిగి సమీపంలో జరిగిన పెళ్లి బస్సు రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి తీవ్రంగా గాయపడగా, బాధితుడికి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స, శస్త్రచికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.1,25,000/ విలువైన (ప్రొసీడింగ్ కాపీ) పత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ చేవెళ్ల నవనీత స్వామి తో కలిసి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మహేష్ బాబాయి మంగలి రామస్వామికి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చి విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. మహిళలు, యువత కోసం ప్రత్యేక పథ కాలను అమలు చేస్తూ వారి ఆర్థిక పురోగతికి ప్రభుత్వం తోడ్పడు తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఆర్డీఓ, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కావలి చంద్రశేఖర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన గడ్డమల్లయ్యగూడ సర్పంచ్

యాచారం, మే 6, ప్రభాతవార్త: మండల పరిధిలోని గడ్డ మల్లయ్యగూడ సర్పంచ్ అచ్చన మంగ జంగయ్య బుధవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే స్వయంగా కండువాకప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అచ్చన జంగయ్య మాట్లాడుతూ గత 5 సంవత్సరాల కాలంలో గ్రామాభివృద్ధి కోసం అప్పటి ప్రభుత్వం నుంచి కేవలం రూ. 23 లక్షలు మాత్రమే నిధుల మం జూరు జరిగిందని, గ్రామంలో యూత్‌భవనం, డ్రైనేజీవ్యవస్థ, గ్రంథాలయం వంటి కనీస వసతులు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో గ్రామాలను పూర్తిగా నిరక్ష ్యం చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభి వృద్ధికే మొదటి ప్రాధాన్యత ఇస్తుంది. సర్పంచ్ మంగ జంగయ్య చేరికతో గడ్డమల్లయ్య గూడ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని అన్నారు. యూత్ భవనం, డ్రైనేజీ, లైబ్రరీ సమస్యలను త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం అని హామీ ఇచ్చారు. జంగయ్యలాంటి అనుభవజ్ఞులైన నాయకులు పార్టీలోకి రావ డం శుభపరిణామం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. టీజిఐఐసి ద్వారా రూ. 45 లక్షలు నిధులు అభివృద్ధి పనుల కోసం మంజూరు చేశారు. రూ. 15 లక్షలు సిసి రోడ్లు, 30 లక్షలు అండర్ డ్రైనేజీకి వాడుతామని సర్పంచ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యులు యార జంగయ్య , గండికోట శ్రీరాములు, గౌర రాములు, వారికుప్పల మమత, ఆర్ల జంగయ్య, ఆవబీరప్ప, బొడ్డు శ్రీశైలం, ఇక్క శివాని, గ్రామస్థులు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాచర్ల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ శివ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు నరసింహ, బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్ర శేఖర్‌రెడ్డి , మూడేడ్ల వెంకట్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న లారీ... మహిళ మృతి

తలకొండపల్ల 6 ప్రభాతవార్త : మండల కేంద్రంలో బైక్‌పై వస్తున్న ఇద్దరిని వేగంగా వస్తున్న లారీ ఢీకొనడంతో మహిళ మృతి చెందింది. అందుకు సంబంధించిన వివరాల ప్రకారం... తలకొండపల్లి మండలం లింగరావుపల్లి గ్రామానికి చెందిన బకి జంగమ్మ(50) బుధవారం కుమారుడు, అల్లునితో కలిసి బైక్ నెంబర్ 070554పై తలకొండపల్లికి వస్తున్నారు. అదే సమయం లో తలకొండపల్లి నుంచి ఎదురుగా వస్తున్న లారీ స్థానిక కాటన్ మిల్ సమీపంలో వేగంగా వస్తూ బైకును ఢీకొంది. దీంతో బైక్ పై వస్తున్న జంగమ్మ అక్కడికక్కడే మృతిచెందగా అల్లునికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సిఐ జానకిరామ్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం అతివేగంతో నడిపిన లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

ఉచిత తాగునీటి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

సొంతనిధులతో ఆర్వో వాటర్ ప్లాంట్: మేడిపల్లి మురళి

గుమ్మడిదల, మే 6, ప్రభాతవార్త:

గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని అన్నారం గ్రామం 5వ వార్డు కెసిఆర్ కాలనీలో కౌన్సిలర్ మురళి సొంత నిధులతో ఆర్వో వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కిషన్, సంజీవరెడ్డి, రాజశేఖర్,జైపాల్‌రెడ్డి, రమేష్, చక్రపాణి, రాజిరెడ్డి,నాయకులు రాజు, హుస్సేన్, వెంకట్రాంరెడ్డి, శేఖర్‌రెడ్డి, సత్యనారాయణ, నరహరి, మహేష్, పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ

కొల్చారం, మే 6, ప్రభాతవార్త:

భూమి పూజ చేస్తున్న దృశ్యం

కొల్చారం మండలం కిష్టాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లేశంగౌడ్ ప్రధాన అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఇల్లు మంజూరుకావడంతో లబ్ధిదారులు పెద్ద విజయ్, నరేష్ ఆనందం వ్యక్తంచేస్తూ, సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి మమత, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్ద శ్రీశైలం, నాయకులు మలికి ప్రవీణ్, గవ్వకాని పోచయ్య, అర కల శీను, మేస్త్రీలు కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి నేరెడిగుంట సమస్యలు

జోగిపేట, మే 6, ప్రభాతవార్త:

గ్రామాభివృద్ధికి సహకరించాలంటూ సంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి మల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ సమస్యలు తీసుకెళ్లినట్లు నేరెడిగుంట సర్పంచ్ ఒగ్గు సాయికిరన్ తెలిపారు. బుధవారం సంగారెడ్డిలో ఆయనను కలిసి గ్రామ పరిస్థితులను వివరించినట్లు తెలిపారు. గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, వీధిదీపాల ఏర్పాటు తదితర అంశాల గురించి డిపివోతో చర్చించినట్లు తెలిపారు. గ్రామంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులులేకుండా అవసరమైనచర్యలు చేపడుతూ ముందుకు సాగుతు న్నట్లు తెలిపారు. అయితే తమ గ్రామ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరామని తెలిపారు.

పేదల నడ్డి విడుస్తున్న మోడీ

మొయినాబాద్, మే 6, ప్రభాతవార్త : మొయినాబాద్ మండలం సిపిఐ కార్యదర్శి కే శ్రీనివాసు ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్యాస్ ధరలు పెట్రోల్ ధరలు ధరలను డీజిల్ ధరలను విపరీతంగా పెంచే పెద్ద పేద ప్రజలను నడ్డి విడుస్తున్నాడని వికాసిత్ భారత అంటే ధరల మీద ధరలు పెంచడం అని మండిపడ్డారు. మోడీ వచ్చినా తర్వాత దేశంలో పేదరికం పెరిగిందని నిరుద్యోగం పెరిగిందని ప్రజల యొక్క తలసరి ఆదాయం తగ్గిపోయిందని దుయ్యబట్టారు. రోజురోజుకు ప్రజల యొక్క కొనుగోలు శక్తి తగ్గిపోతుందని రైతు కూలీలకు కార్మికులకు కర్షకులకు కనీస వేతనాలు లేక ఒకపక్క అల్లాడిపోతుంటే కుటుంబ భారం మోయలేక అన్యాయం రామచంద్రాన్ని అని బాధపడుతూ ఉంటే మోడీ ప్రభుత్వం ధరల మీద ధరలు పెంచే పేద ప్రజల నడ్డి విడుస్తుంది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలును వెంటనే తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో సురంగల్ మల్లేష్ ఉప్పరి సురేష్ కాసిం భాయ్ బాలమణి పెద్ద మంగళారం పాండు వడ్ల రాములు మల్లమ్మ పెంటమ్మ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ సభను జయప్రదం చేద్దాం

చేవెళ్ల, మే 6, ప్రభాతవార్త: హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 10న నిర్వహించే తలపెట్టిన ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభను జయప్రదం చేద్దామని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, భాజపా నాయకులు కె.ఎస్. రత్నం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంత్ రెడ్డి మరియు మండల అధ్యక్షుడు శ్రీకాంత్ అధ్యక్షతన చేవెళ్లలో భాజపా నాయకులతో కలిసి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించే కీలక వేదికగా ఈ సభ నిలవనుందని పేర్కొన్నారు.ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ప్రజలకు తెలియజేయడానికి ఈ సభ మంచి అవకాశం అని చెప్పారు.చేవెళ్ల నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఇందుకోసం ప్రతి గ్రామం, మండల స్థాయిలో సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని పార్టీ నాయకులకు సూచించారు. ఈ సమావేశంలో భాజపా నాయకులు మోహన్ రెడ్డి డాక్టర్ వైభవ్ రెడ్డి వెంకట్ రెడ్డి మాణిక్య


కమలం పువ్వు గుర్తు గోడలపై వేస్తున్న బిజెపి నాయకులు

రెడ్డి అశోక్ పత్తి సత్యనారాయణ కరికే శ్రీనివాస్ చీర శ్రీనివాస్ కుమార్ గౌడ్ చంద్రశేఖర్ రెడ్డి అభి శేఖర్ రెడ్డి జైపాల్ రెడ్డి రిషికేశ్ ఉమాశంకర్ రెడ్డి బాల్ రెడ్డి శ్రీకాంత్‌రెడ్డి కృష్ణ విఠల్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎఎంసి చైర్మన్ సుధాకర్‌రెడ్డి

పేదల ఇంటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం

మునిపల్లి, మే 6 (ప్రభాతవార్త): సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లోని పెద్దగోపులారం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమం జరిగింది.ఎఎంసి చైర్మన్ సుధాకర్‌రెడ్డి ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఇంటి కాల కాంగ్రెస్ ప్రభు త్వంతోనే సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పద్మ దుర్గయ్య, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, మండల అధ్యక్షులు సతీష్‌కుమార్, మాజీ ఎంపీటీసీ పాండు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ విజయ్, నాయకులు సంగన్న, దుర్గయ్య, గోపులారం సర్పంచ్ మల్లేశం, ఖమ్మంపల్లి కాంగ్రెస్ నాయకులు గుడ్డు పటేల్, నాయకలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉర్సు ఉత్సవాలు

మునిపల్లి, మే 6 (ప్రభాతవార్త): మునిపల్లి మండలం, ఇబ్రహీంపూర్ హజ్రత్ సూఫీ షా మహమ్మద్ మారూఫ్ అలీ ఉర్ఫ్ ఖమర్ హుస్సేన్ ఖాద్రీ 48వ ఉర్సు ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ సుధాకర్‌రెడ్డి, పిఏసి ఎస్ చైర్మన్ పద్మదుర్గయ్య, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్, మాజీ ఎంపీటీసీ పాండు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ విజయ్, నాయకులు సంగమేశ్వర్, దుర్గయ్య, మక్సూద్ పటేల్, గోపులారం సర్పంచ్ మల్లేశం, ఖమ్మంపల్లి కాంగ్రెస్ నాయకులు గుడ్డు పటేల్, అల్లాపూర్ సర్పంచ్ నారాయణ, ఇబ్రహీంపూర్ సర్పంచ్ ల్యాగాల అశోక్, ఉపసర్పంచ్ మొహియుద్దీన్, గ్రామ అధ్యక్షుడు షేక్‌అలీ, యూత్ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, వార్డుసభ్యులు సన్మానించారు.

బెజ్జంకి మార్కెట్ యార్డులో రైతు వారోత్సవాలు

ఉత్తమ రైతులను సత్కరిస్తున్న దృశ్యం

బెజ్జంకి, మే 6, ప్రభాతవార్త : బెజ్జంకి మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటి ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఎఎంసి చైర్మన్ పులి కృష్ణ రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్లు, మండల విస్తీర్ణ అధికారులతో పాల్గొని సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో రైతుల సమస్యలు, వ్యవ సాయానికి సంబంధించిన ఆర్థిక సహాయం,రుణ సౌకర్యాలపై చర్చించారు. అనంతరం నలుగురు ఆదర్శ రైతులను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు సంతోష్, మల్లేశం, సర్పంచ్ పెద్దన్న, ఉప సర్పంచ్ మహేష్, వ్యవసాయాధికారి, బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న సర్కార్

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

కొమురవెల్లి, మే 6, ప్రభాతవార్త : ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని సీపీఎం పార్టీ సిద్దిపేట జిల్లా కార్య దర్శి వర్గ సభ్యులు సత్తిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మర్రిముచ్చాల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. కొను గోలు కేంద్రాలలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడు లేడన్నారు. లారీలు సకాలంలో రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అకాల వర్షం కురిసే అవకాశం ఉన్నందున్న వెంట వెంటనే ధాన్యం కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర చెల్లించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 10 శాతం కూడా వరి ధాన్యం కొనుగోలు చేయలేదని దీంతో రైతులు పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాడూరి రవీందర్, బద్దిపడగ కృష్ణారెడ్డి, సురేందర్‌రెడినడ, మైపాల్, బాలరాజు, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం

నర్సాపూర్, మే 6, ప్రభాతవార్త : మండల పరిధిలోని తుజాల్‌పూర్ గ్రామంలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపసర్పంచ్ అక్కమ్మొల్ల శ్రీనివాస్ ఒకటవ వార్డు సభ్యురాలు గాలి భవానిమహేష్ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను శాలువాలతో సన్మానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు శ్రీరాంయాదయ్య, వార్డు సభ్యులు యాదగిరి, నాయకులు కల్లూరి ఆంజనేయులుగౌడ్, గాలి లింగం, గాలి ఆంజనేయులు,లక్ష ్మణ్, నర్సింలు, శివ, అనిత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బొడ్మట్‌పల్లిలో హోరాహోరీగా సాగిన కుస్తీ పోటీలు

టేక్మాల్, మే 6 ప్రభాతవార్త: మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి గ్రామం లో శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవా రం కుస్తీపోటీలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లోన భాగంగా వీరభద్రాల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుస్తీ పోటీల్లోనారాయణఖేడ్, బీదర్, పీట్లం, మహారాష్ట్ర నుంచి కుస్తీపోటీలో పాల్గొనేందుకు మల్లయో దులు తరలివచ్చారు. కొబ్బరికాయ కుస్తీ పోటీ నుంచి ఐదు తులాల కడెం పోటీ వరకు మల్లయోదులు తలపడ్డారు. కడెం పోటీలో ఉద్గిర్‌కు చెందిన యదవ్ గెలుపొందారు. మల్లయోధునికి 5 తులాల వెండి కండెను బహూ కరించారు. ఇందులో ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్, సర్పంచ్ అవినాష్, వార్డుసభ్యులు, కార్యకర్తలు కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ పడిపూజ

కొండపాక, మే 6, ప్రభాతవార్త : లకుడారం గ్రామంలో హనుమాన్ పడి పూజను అంగరంగ వైభవంగా కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ అభయంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ మాల ధరించిన భక్తులు, గ్రామస్తులు సోమవారం రాత్రి కలిసి దేవాలయం అవరణల శ్రీసీతారామ స్వామి, హనుమాన్ విగ్రహాలను ఏర్పాటు చేసి పడిపూజలో భాగంగా గణపతి, నవగ్రహ, సకల దేవతల అవహనం పంచామృత స్నాపణాల పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినందుకు మేర్గోజు సాయి కుమార్, ఇతర పంతుళ్ళను శాలువాలు కప్పి హనుమాన్ భక్తులు ఘనంగా సన్మానించారు.

పుస్తెలు, మెట్టెలు అందజేత

చిన్నశంకరంపేట, మే 6, ప్రభాతవార్త:

మండలపరిధి మడూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన దివ్య వివాహానికి మైనంపల్లి సోషల్‌సర్వీస్ ఆర్గనైజేషన్‌ద్వారా హనుమంతరావు పుస్తెమెట్టెలు పంపగా కాంగ్రెస్‌నాయకులు ముత్తిగల రామచంద్రం, మాజీ ఉపసర్పంచ్ సాయిలు దివ్యకు అందించారు. కార్యక్రమంలో రాములు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

వేంకటాచల దివ్యక్షేత్రంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

-సంతాన ప్రాప్తికి గరుడ ప్రసాదం అందించిన వరదాచార్య స్వామి

పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సదాశివపేట, మే 6, ప్రభాతవార్త:

సదాశివపేట మండలం వెంకటాపురం గ్రామంలోని వేంకటాచల దివ్య క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ చతుర్థ వార్షికోత్సవాల సందర్భంగా మంగళవారం నుంచి నాలుగురోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో స్వామివారి ప్రతిష్ఠాపనను నిర్వహించిన కందాడై వరదాచార్య స్వామి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయని ఆలయ కమిటీ తెలిపింది. బుధవారం జరిగిన కార్యక్రమాలలో అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణ, ధ్వజస్తంభ ఆరాధన, మూలమంత్ర హోమం వంటి పూజలను ఘనంగానిర్వహించారు. ఈసందర్భంగా సంతానంలేని దంపతులకు సంతానప్రాప్తి కలగాలని గరుడప్రసాదాన్ని ఆలయ పూజారులు అందించారు. అనంతరం స్వామివారికి మంగళహారతులు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదం పంపిణీచేశారు. వెంకటాపురం సర్పంచ్ ఒగ్గు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సాయంత్రం గ్రామం నుంచి దివ్యక్షేత్రం వరకు భక్తులు కోలాటాలు, భజనలు చేస్తూ శేషవాహన సేవను ఘనంగా నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాలను దర్శించేందుకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు దూర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ వెల్లడించింది.

ఆకుపచ్చగా మంజీరా వాగు..

ఆకుపచ్చగా మారిన మంజీరావాగు నీరు

చిలిపిచెడ్, మే 6, ప్రభాతవార్త:

మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండల పరిధిలోని చిట్కుల్ గ్రామశివారులో గల ప్రసిద్ధిగాంచిన శ్రీచాముండేశ్వరి ఆలయ పరిసర ప్రాంతంలోని మంజీరానదిలో ఉన్నట్టుండి స్వచ్ఛమైననీరు కాస్తా ఆకుపచ్చ రంగులోకి మారి ప్రజలను ఆశ్చర్యపరుస్తోంది. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు స్నానాలు చేసేందుకు వాగులోకి వెళ్లగా ఆకుపచ్చ రంగులో మారిన నీటిని చూసి భయభ్రాంతులకు గురవుతున్నారు. స్వచ్ఛమైననీళ్లు ఆకుపచ్చ రంగులో మారడానికి నదీప్రవాహంలో వివిధ ఫార్మా కంపెనీల నుంచి వెలువడే వ్యర్థ పదార్థాలు, రసాయనాలే కారణమని అనుమానిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు మహారాష్ట్ర, కర్ణాటక ఇతరరాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు వస్తుంటారు. అమ్మవారి సన్నిధిలోగల మంజీరానదిలో స్నానాలుచేస్తే పాపాలు తొలుగుతాయని అక్కడి భక్తుల నమ్మకం. అలాంటిది మంజీరానది రంగుమారడంతో స్నానాలు చేసేందుకు వీల్లేకుండా అయింది. స్థానాలు చేయకుండా దైవదర్శనానికి ఎలా వెళ్లాలని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి స్వచ్ఛమైన నీటిని కలుషితం చేస్తున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు పలువురు కోరుతున్నారు. వాగులోని నీళ్లలో స్నానాలు చేసేందుకు భక్తులు జంకుతున్నారు.

సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శివకుమార్

సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మల్కాపురం శివకుమార్

ఝరాసంగం, మే 6, ప్రభాతవార్త:

కోర్టు ఉత్తర్వులు, ప్రభుత్వ ఆదేశాలమేరకు బుధవారం మండల పరిధిలోని ఏడాకులపల్లి సొసైటీ చైర్మన్‌గా మల్కాపురం శివకుమార్ పాలకవర్గంతో కలిసి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్‌చైర్మన్‌గా కాంతమ్మ, డైరెక్టర్లుగా శ్రీనివాస్, అనంత్‌రామ్‌గౌడ్, రాజు, శ్రీశైలం, భాస్కర్, బస్వరాజు, ఏడాకులపల్లి, చిలేమామిడి, జొన్నగామ, ఈదులపల్లి, మాచ్నూర్ గ్రామాల సర్పంచులు విష్ణువర్ధన్‌రెడ్డి, జైరాజ్, విజయలక్ష్మికృష్ణ, సంగమణినాగేశ్వర్, మాధవివెంకటేశం, ఆయాగ్రామాల ఉపసర్పంచులు, వార్డుసభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మాతృశ్రీకి నివాళులు అర్పించిన ఎంపి

మాతృశ్రీకి నివాళులు అర్పిస్తున్న ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్

ఝరాసంగం, మే 6, ప్రభాతవార్త:

మండలపరిధిలోని బర్దీపూర్‌గ్రామంలో ఆధ్యాత్మికకేంద్రంగా విరాజిల్లుతున్న శ్రీదత్తగిరి ఆశ్రమ మాతృశ్రీ అనసూయమాత మంగళవారం శివైక్యం చెందినట్లు తెలుసుకున్న జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ బుధవారం ఆశ్రమాన్ని సందర్శించి మాతృశ్రీ అనసూయమాత సమాధి మందిరంలో నివాళులు అర్పించి ఆశ్రమపీఠాధిపతులు వైరాగ్యశిఖామణి 1008అవధూత గిరి మహారాజ్(అప్పగారు), సిద్దేశ్వరానందగిరి మహారాజ్‌లను పరామర్శించారు. ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్‌వెంట వివిధమండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, ఉత్సవకమిటీ సభ్యులు ఉన్నారు.

కుడిచెరువు తూము ధ్వంసం

-సాగునీరు అందక రైతుల ఇబ్బందులు

ధ్వంసమైన వెల్దుర్తి కుడిచెరువు తూము దశ్యం

వెల్దుర్తి, మే 6, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన వెల్దుర్తిలోని కుడిచెరువు తూము ధ్వంసంకావడంతో సాగునీరు లేక ఇబ్బంది పడుతున్నామని రైతులు తెలిపారు. గతంలో మిషన్ కాకతీయ పథకంలో కుడిచెరువుకు మరమ్మతులు జరగక, రిపేర్ చేయకపోవడంతో కొద్దిరోజులకు కట్ట కుంగి ధ్వంసమైందని రైతులు తెలిపారు. పంట పొలాలకు తూము ద్వారా రాకపోవడంతో విచ్ ఇస్ మోటార్లతో నీటిని తీస్తున్నారు. 96 ఎకరాలకు నీరు అందడంలేదని తెలిపారు. పలుమార్లు ఇరిగేషన్‌శాఖ అధికారులకు తెలిపినా, పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపించారు. ఈ విషయమై జిల్లాస్థాయి ఉన్నత అధికారులకు ఫిర్యాదుచేశామని అధికారులు స్పందించి వర్షాకాలం రాకముందే మరమ్మతులకు నిధులుమంజూరు చేసి. తూమును మరమ్మతులు చేసి రైతుల సమస్యను తీర్చాలని కుడిచెరువు ఆయకట్టుదారులు అధికారులను కోరుతున్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధిహామి కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడివో దామోదర్

చిన్నశంకరంపేట, మే 6, ప్రభాతవార్త:

ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడివో దామోదర్ అన్నారు. బుధవారం మండల పరిధి కామారం తండాలో ఉపాధి హామీ పనులతో పాటు నర్సరీ, ఇందిరమ్మ ఇళ్లను, కొనుగోలు కేంద్రాలను ఎంపిడివో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల వద్ద కూలీలతో మాట్లాడి సమస్యలపై ఆరాతీశారు. ఎండ వేడిమి ఉన్నందున ఉపాధిహామీ కూలీలకు కావలసిన సౌకర్యాలను కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచి మోహన్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి స్వర్ణలత తదితరులున్నారు.

రైతుల సేవకే పునరంకితం



ప్రమాణ స్వీకారం చేసిన శ్రీనివాస్‌రెడ్డి, సహకారసంఘం డైరెక్టర్లు

చిన్నశంకరంపేట, మే 6, ప్రభాతవార్త:

వ్యవసాయ సహకార సంఘంలో అవకాశం ఉన్నంతవరకు రైతుల సేవకు అంకితమవుతానని మడూర్ సహకారసంఘం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు బుధవారం సహకార సంఘంలో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు పోచమ్మ, సిద్దిరాములు, శ్రీశైలం, బాగయ్య, శ్రీనివాస్, చంద్రం, విఠల్, లక్ష్మీ, బక్కనగారి లక్ష్మీ, సిద్దగౌడ్, యాదగిరి, రమేష్, ప్రమాణస్వీకారం చేశారు. సహకారసంఘాల గడువు 14.02.2025లోనూ ముగిసిపోగా, అనంతరం 24.02.2025న రాష్ట్ర ప్రభుత్వం పాలకవర్గాల గడువును 6నెలలు పొడిగించింది. మొదటిసారి ఇచ్చిన గడువు ముగియడంతో 03.09.2025న మరో 6 నెలల గడువును పొడిగిస్తూ ప్రభుత్వం 2వసారి ఉత్తర్వులు జారీచేసింది. గడువు ముగియకముందే ప్రభుత్వం పాలకవర్గాలను 19.12.2025న రద్దుచేసింది. ప్రభుత్వం సహకారసంఘాలకు వర్సన్ ఇంచార్జిలను నియమించగా, సహకారసంఘం సభ్యులు పాలకవర్గాల పొడిగింపుపై హైకోర్టుదాకా వెళ్లింది. పాలకవర్గాలను తిరిగి యథావిధిగా కొనసాగించాలని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాలమేరకు సహకారసంఘం చైర్మన్, డైరెక్టర్లు సిఈవో కృష్ణ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. వారు మాట్లాడుతూ మళ్లీ వచ్చిన అవకాశంతో రైతుకు సేవ చేసుకునే అవకాశం వచ్చిందని సంతోషం వ్యక్తంచేశారు.

వార్డులో నీటి సమస్యకు పరిష్కారం

-బోర్ వేయించిన కౌన్సిలర్ అవర్ణ శివరాజ్ పాటిల్



బోరుబావి వేయిస్తున్న దృశ్యం

సదాశివపేట, మే 6, ప్రభాతవార్త:

సదాశివపేట పురపాలక సంఘం 26వ వార్డులో ప్రజల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని బిఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అపర్ణశివరాజ్‌పాటిల్ కృషితో బోర్ వేయించారు. పురపాలక సంఘం నిధులతో చేపట్టిన ఈపనితో స్థానిక ప్రజలకు తాగునీటిసమస్యకు ఉపశమనం కలగనుంది. వేసవి కాలంలో తీవ్రంగా ఎదురవుతున్న నీటి కొరతను నివారించేందుకు ఈచర్యలు తీసుకున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలు కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్యే

నారాయణఖేడ్, మే 6, ప్రభాతవార్త:

నారాయణఖేడ్ మండల పరిధిలోని హుక్రాన (జి) గ్రామంలో బుధవారం నిర్వహించిన గృహప్రవేశ వేడుకల్లో గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామానికి చెందిన సుజాతకృష్ణారెడ్డి దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంట్లోకి ప్రవేశిస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, నిరుపేదల సంక్షేమంకోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టంచేశారు. నూతన గృహంలో ఆ కుటుంబం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రావుల బసిరెడ్డి, వెంకట్రాంరెడ్డి, శివకుమార్ ఉపసర్పంచ్, రాజు, యేసు, వార్డుసభ్యులు పండరిరెడ్డి, మాజీ ఎంపిటిసి అశోక్‌రెడ్డి, ఫ్యాక్స్ మాజీ చైర్మెన్, రాఘవరెడ్డి, నాందేవ్‌రెడ్డి, సుభాష్, సాయిరెడ్డి, మారుతిరెడ్డి, ఇంత్యాజ్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్థులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

వెల్దుర్తిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

వెల్దుర్తి, మే 6, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన వెల్దుర్తిలోని గోనెమైసమ్మ మందిరం పరిధిలో బుధవారం రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఎ.మాధవి. డాక్టర్ టి.సుకృత్ కుమార్, మ్యాని పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నేల ఆరోగ్యం తగువిధమైన చర్యలు చేపట్టవలసిందిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆదర్శ్, చర్లపల్లి ఉపసర్పంచ్ పెంటారెడ్డి, వార్డు సభ్యుడు రాజు, ఎంఈఓ మజీద్ అలీ, రైతులు పాల్గొన్నారు. అందులో పల్లి గ్రామంలో సర్పంచ్ మహమ్మద్ వ్యాధులు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని శాస్త్రవేత్త డాక్టర్ రజనీదేవి పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఈఓ సింధు, రైతులు పాల్గొన్నారు.

మండలంలో టిజిఐఐసి చైర్మన్ సుడిగాలి పర్యటన

కంది, మే 6, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో బుధవారం టిజిఐఐసి చైర్మన్ తూర్పు నిర్మాలాజగ్గారెడ్డి సుడిగాలి పర్యటనచేశారు. మండలపరిధిలోని బేగంపేట గ్రామంలో బిఆర్ఎస్ కార్యకర్త ఎల్లాగౌడ్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో నిర్మలాజగ్గారెడ్డి పాల్గొని గృహప్రవేశంచేసి శుభాకాంక్షలు తెలిపారు. కలబ్‌గూరులో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించిపండించిన ధాన్యాన్ని మధ్యదళారులకు అమ్ముకుని ఆగంకావొద్దని, కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతుధరను అందుకోవాలని అన్నదాతలకు సూచించారు. కాంగ్రెస్‌ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని గుర్తుచేశారు. ఇదిలా ఉండగా, సంగారెడ్డి బైపాస్‌రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన ఫోం సర్వీసింగ్ కేంద్రాన్ని చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి ప్రారంభించారు. ఆయాకార్యక్రమాల్లో కాంగ్రెస్‌నాయకులు మాజీ కౌన్సిలర్ వెంకట్ రాజు, కౌన్సిలర్ నవాజ్‌లు పాల్గొన్నారు.

సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలి: సిపిఐ నిరసన

నిరసన తెలుపుతున్న సిపిఐ నాయకులు

సదాశివపేట, మే 6, ప్రభాతవార్త:

కేంద్ర ప్రభుత్వం ఇటీవల కమర్షియల్, డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లపై పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ సిపిఐ నాయకులు సదాశివపేటలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.తాజుద్దీన్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తన ఇష్టానుసారంగా గ్యాస్‌సిలిండర్ల ధరలనుపెంచి మధ్యతరగతి ప్రజలపై తీవ్ర భారం మోపిందని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్లో గ్యాస్, చమురు ధరలు పెరిగిన ప్పుడు వెంటనే ప్రజలపై భారంమోపుతున్న ప్రభుత్వం, అదేధరలు తగ్గిన ప్పుడు మాత్రం ఎలాంటి ఉపశమనం కల్పించడం లేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని, ఇప్పటికైనా పెంచినధరలను వెనక్కితీసుకుని ప్రజలకు ఉపశమనం కల్పించాలని సిపిఐ డిమాండ్‌చేసింది. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి షఫీ, సాధకలి, ముస్తఫా, యాకుబ్ అలీ, పూలమ్మ, తస్లిమ్, గోరిబీ తదితరులు పాల్గొన్నారు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు విజయవంతం

రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

కొల్చారం, మే 6, ప్రభాతవార్త:

రాంపూర్ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు పలుకీలక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు డా.పి.సతీష్, డా.సి.హెచ్.రమ్యశ్రీ పాల్గొని రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. అలాగే గ్రామసర్పంచ్, ఉపసర్పంచ్, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారి పెద్దసంఖ్యలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆడపడుచు పెళ్లికి పుస్తెమెట్టెలు బహూకరణ

జోగిపేట, మే 6, ప్రభాతవార్త:

మండల పరిధిలోని మక్తగూడెం గ్రామానికి చెందిన దుర్గయ్య-పుష్పలతల కుమర్తెల నాగరాణి వివాహానికి నేరెడిగుంట గ్రామ సర్పంచ్ ఒగ్గు సాయికిరన్ తల్లి వసంత, మక్తగూడెం వార్డుసభ్యులు విష్ణుల ఆధ్వర్యంలో బుధవారం వారి ఇంటికి వెళ్లి పుస్తెమెట్టెలు అందచేశారు. గ్రామంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీమేరకు ఆడపడచు పెండ్లికి పుస్తెమెట్టెలు ఇస్తాననే వాగ్దానాన్ని నిలబెట్టుకుంటున్నారు. గ్రామంలోని ప్రతి ఆడపడచును కుటుంబ సభ్యురాలిగా భావిస్తూ, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవటం తనకు సంతోషంగా ఉందని సర్పంచ్ సాయికిరన్ తెలిపారు.

మొగుడంపల్లిలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు



మొగుడంపల్లిలో రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

మొగుడంపల్లి, మే 6, ప్రభాతవార్త:

ప్రజాపాలన-ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రమైన మొగుడంపల్లిలో జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎఈఓ కనీజ్ భూమేష్, సరస్వతి, సర్పంచ్ రాజు, ఉపసర్పంచ్ సంజీవ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మారుతి, వార్డుసభ్యులు, రైతులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేస్తున్న సర్పంచ్

చౌటకూరు, మే 6, ప్రభాతవార్త:

మండలపరిధిలోని గంగోజిపేట సర్పంచ్ కుమ్మరి అపనితఅశోక్ పంచాయతీ ఎన్నికల సందర్భంగా చేసిన హామీలను అమలు చేస్తూ ప్రజలచే శభాష్ అనిపించుకుంటున్నారు. గ్రామానికి చెందిన కుమ్మరి దశరథ్ కుమార్తె కె.పావని వివాహానికి సర్పంచ్ ఎన్నికల్లో చేసిన హామీ మేరకు 10వేల రూపాయల ఆర్థిక సహాయం అందచేసి నూతన వధూవరులను ఆశీర్వదించి కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకలకు సర్పంచ్‌తోపాటు ఉపసర్పంచ్ తస్లీమాబేగం, వార్డుసభ్యులు రాజా గౌడ్,నప్రసాద్, లక్ష్మి, యాదగిరి, నందిని, కాంగ్రెస్ నాయకులు బాలా గౌడ్, మన్సూర్, నగేష్, కృష్ణ, గొంగయ్య, ప్రవీణ్, శ్రీనివాస్, రాజేందర్, శ్రీకాంత్ తదితరులు హాజరై నూతన వధూవరులకు వివాహ శుభాకాంక్షలు తెలిపారు.

ఫార్మసీ విద్యార్థులకు సర్పంచ్ విరాళం

చౌటకూరు, మే 6, ప్రభాతవార్త:

జెఎన్టియు ఫార్మసీ కళాశాల విద్యార్థులకు మండలపరిధిలోని సరాఫ్‌పల్లి సర్పంచ్ నందికంటి రామచంద్రారెడ్డి బుధవారం విరాళం అందచేశారు. ఫార్మసీ కళాశాలలో విద్యను అర్జిస్తున్న విద్యార్థులు ఈ నెల 7,8వ తారీఖులలో మెడోవా-2కె26 ఫెస్ట్ నిర్వహిస్తున్నందున ఫెస్ట్‌కు అవసరమైన వ్యయం విద్యార్థులే భరించుకోవాల్సి ఉండటంతో విద్యార్థులు విరాళాలు సేకరించడంతోపాటు దాతలనుంచి సైతం విరాళాలు సేకరిస్తున్నారు. ఇందులోభాగంగా సర్పంచ్ నందికంటి రామచంద్రారెడ్డి విద్యార్థులకు తనవంతుగా విరాళం అందచేశారు. విద్యార్థులు నిర్వహించే ఫార్మసీ కళాశాల వార్షికోత్సవాల్లో భాగంగా టెక్ ఫెస్ట్, స్పోర్ట్స్ డే, వార్షికోత్సవ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహా, జెఎన్టియు వైస్‌చాన్సలర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి, జెఎన్టియు డైరెక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్‌రావులు హాజరుకానున్నారని ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సునీతారెడ్డి వివరించారు.

రైతుల అభివృద్ధే లక్ష్యం: చైర్మన్



రైతులను సన్మానిస్తున్న ఆగమ సాయిచరణ్, జి.తిరుపతిరెడ్డి

జహీరాబాద్, మే 6, ప్రభాతవార్త:

జహీరాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల యాక్షన్ ప్లాన్, ప్రజాపాలన ప్రగతిప్రణాళికలో భాగంగా రైతువారోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మార్కెట్ కమిటీ చైర్మన్ ఎ.సాయిచరణ్ మాట్లాడుతూ, రైతులు పండించిన పంటలకు వ్యవసాయ కొనుగోలు కేంద్రాలద్వారా సరైన గిట్టుబాటు ధర కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు శేఖర్, జాఫర్, అఖిల్, కిషన్, అంజత్, శంకర్‌పాటిల్, మార్కెట్‌కమిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం: కంది కృష్ణ

కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న శ్రీనివాస్

సదాశివపేట, మే 6, ప్రభాతవార్త:

రైతుల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ తెలిపారు. బుధవారం ప్రజాపాలన-ప్రగతిప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99రోజుల కార్యాచరణలోభాగంగా రైతువారోత్సవాలు సదాశివపేట వ్యవసాయ మార్కెట్‌కమిటీ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ సెక్రటరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కంది కృష్ణ మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ శివకుమార్, సయ్యద్ యూసఫ్, విశ్వనాథ్, కళావతి, వ్యవసాయశాఖ ఎఒ రమేష్, మార్కెట్ సిబ్బంది, వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

వరి కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పాండు

పుల్‌కల్, మే 6, ప్రభాతవార్త:

ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పాండు ఆదేశించారు. బుధవారం మండల కేంద్రమైన పుల్‌కల్‌తో పాటు మండల పరిధిలోని గొంగ్లూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ పాండు పరిశీలించారు. ఈసందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అందుతున్న సౌకర్యాలు, ధాన్యం తూకం విధానం, రికార్డుల నిర్వాహణ, తేమ శాతం తదితర అంశాలను పాండు రైతులను, కేంద్రం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని అధికారులకు సూచించారు. ధాన్యం రవాణాకు సంబంధించి జాప్యం జరుగకుండా ట్రాన్స్‌ఫోర్ట్ వాహనాలను పెంచాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, కూర్చునేందుకు సౌకర్యాలు విధిగా ఉండేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రంలో నెలకొన్న సమస్యలను రైతులు అదనపు కలెక్టర్‌దృష్టికి తీసుకురాగా, సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ పాండు వెంట తహసీల్దార్ కృష్ణ ఉన్నారు.